సాక్షి కర్నూలు

శనివారం । 17 । మే । 2025



అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలం టెంపుల్: ధర్మపథంలో భాగంగా శుక్రవారం నిత్య కళావేదికపై హైదరాబాద్‌కు చెందిన ఉదయశ్రీ నాట్య అకాడమీ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



రైతు బజారు నిండా దళారులే!

కర్నూలులోని సీ - క్యాంప్ రైతుబజార్ దళారులకు అడ్డాగా మారింది. దళారులను 'కూటమి' నేతలు ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. IIలో▸



ఐటీఐ.. అవకాశాలు మెండుగా!

ఉద్యోగం, ఉపాధి కోసం పలువురు విద్యార్థులు ఐటీఐ కోర్సులకు ప్రాధాన్యమిస్తున్నారు. ఐటీఐ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 24వ తేదీ తుది గడువుగా ఉంది. IIలో▸

న్యూస్‌రీల్

సైనికులకు జోహార్లు



ర్యాలీలో పాల్గొన్న మాజీ సైనికులు


కర్నూలు(సెంట్రల్): ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదులు తోక జాడించారని, భవిష్యత్‌లో టెర్రరిస్టులు భారత్ వైపు చూడాలంటే భయపడేలా చేసిన సైనికులకు జోహార్లు అని మాజీ సైనికుల జిల్లా అధ్యక్షుడు నర్రా పేరయ్య చౌదరి అన్నారు. శుక్రవారం జిల్లా మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో రాజ్‌విహార్ నుంచి కలెక్టరేట్ వరకు జై భరత్ మాతాకి జై అంటూ వందలాది మంది మాజీ సైనికులు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆపరేషన్ సిందూర్‌తో భారత్ సైనిక బలమేమిటో ప్రపంచానికి తెలిసిందన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో ప్రాణాలుకోల్పోయిన సైనికులకు నివాళులు అర్పించారు. రూటు, గడ్డం రామకృష్ణ, కె.రాముడు, మనోహర్‌రాజు, మున్నీర్, రవీంద్ర, సూర్య నారాయణ పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు


- ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలకు డీఈఓ హెచ్చరిక

కర్నూలు సిటీ: జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలలపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్ శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు గత నెల 24వ తేదీ నుంచి వేసవి సెలవులు ప్రకటించామన్నారు. కానీ కొన్ని ప్రైవేటు స్కూళ్లలో ఇప్పటికీ తరగతులు నిర్వహిస్తున్నట్లు విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులను అడ్మిషన్లకు క్యాంపెయిన్ చేయిస్తున్నట్లు తెలుస్తోందన్నారు. ప్రచార నిమిత్తం ఇష్టానుసారంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. వీటిని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తే పాఠశాల గుర్తింపు రద్దు చేస్తామన్నారు. ప్రైవేటు స్కూళ్ల తనిఖీలకు ఎంఈఓలు, డిప్యూటీ డీఈఓలు వచ్చిన సమయంలో సరైన సమాచారం అందించాలని, లేకపోతే చర్యలు తప్పవన్నారు.

రాష్ట్రంలో తారాస్థాయికి కక్ష రాజకీయాలు



కర్నూలు కల్చరల్: రాష్ట్రంలో కక్షపూరిత రాజకీయాలు తారాస్థాయికి చేరాయని వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఐఏఎస్, ఐపీఎస్‌లను టార్గెట్ చేసుకొని సస్పెన్షన్ వేటు వేయడం ఈ ప్రభుత్వానికి పరిపాటిగా మారిందన్నారు. తాజాగా మాజీ ఐఏఎస్, మాజీ ప్రభుత్వ అధికారులపైనా చంద్రబాబు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని రుద్దుతున్నారన్నారు. ఆయన కుట్రపూరిత చర్యలతో రాష్ట్రాన్ని, ప్రజలను కోలుకోలేని విధంగా దెబ్బతీస్తున్నారన్నారు. హామీలను అమలు చేయకపోగా, అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాడన్నారు. రాష్ట్రంలో ఎవరికీ భద్రత లేదన్న సంకేతాన్ని చంద్రబాబు ఇస్తున్నారన్నారు. మాజీ ఐఏఎస్ ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిల అరెస్టను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. తప్పుడు రాజకీయాలు మాని రాష్ట్రాభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు.



హామీల బాబు.. పాలన డాబు!

- అమలు కాని సంక్షేమ పథకాలు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మహిళలు, రైతులు
- ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గనున్న ఉపాధ్యాయులు
- నెరవేరని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆశలు
- రూపుదిద్దుకోని అప్రోచ్ రహదారులు
- కాలువల కింద పండని పంటలు
- వృత్తి కార్మికులకు తప్పని కష్టాలు
- నేడు కర్నూలుకు రానున్న సీఎం చంద్రబాబు

పేదింటి బిడ్డలు ప్రభుత్వ బడికి వెళ్దామంటే ఉపాధ్యాయులు తగ్గారని చెబుతున్నారు.. ఆడబిడ్డల కోసం 'మహాశక్తి' వస్తుందని చేసిన ప్రచారం ఉత్తిదే అని తేలిపోయింది. స్వయం సహాయక సంఘాలకు రూ.10 లక్షల వరకు సున్నా వడ్డీ రుణాలు అతీగతీ లేకుండా పోయాయి. అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకూ రూ.20 వేలు ఇప్పటి వరకు అందలేదు. ఆలూరు బ్రాంచ్ కెనాల్ కింద నీరు అందక అన్నదాతలు కన్నీరు కారుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా అప్రోచ్ రోడ్లు నిర్మిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చినా అమలు కాలేదు. సంక్షేమ పథకాలు అందక ప్రజలందరూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పలు సార్లు జిల్లాకు వచ్చినా ప్రయోజనం ఉండటం లేదని నిరుత్సాహాన్ని వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ అధినేతగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు.. అధికారంలోకి వచ్చాక మరచిపోయారని చెబుతున్నారు. సమస్యలు పరిష్కరించాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజలను మోసం చేసి ఎలా పర్యటన చేస్తారని కొందరు ప్రశ్నిస్తున్నారు. హామీలు అమలు చేయాలని వృత్తిదారుల సంఘం నాయకులు కోరుతున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు కర్నూలుకు శనివారం రానున్నారు.
ఈ సందర్భంగా ప్రత్యేక కథనాలు..

పల్లెలకు తొలగని 'దారి'ద్ర్యం

- ఎనిమిది నెలలైనా లభించని అనుమతులు

కర్నూలు(అర్బన్): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలు ఎనిమిది నెలలైనా నెరవేరని పరిస్థితి జిల్లాలో నెలకొనింది. గత ఏడాది అక్టోబర్ 1న జిల్లాలోని పత్తికొండ మండలం పుచ్చకాయలమాడ గ్రామానికి వచ్చిన చంద్రబాబు.. గ్రామ సర్వతోముఖాభివృద్ధికి అనేక హామీలు ఇచ్చారు. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలైతే గ్రామం అభివృద్ధి చెందుతుందని అప్పట్లో గ్రామసున్తలు సంబరపడ్డారు. అయితే కేవలం పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా గ్రామంలో అంతర్గత రోడ్లను మాత్రమే వేశారు. ఇక ... పుచ్చకాయలమాడ గ్రామం నుంచి సమీప గ్రామాలకు వెళ్లేందుకు ఉద్దేశించిన అప్రోచ్ రోడ్లకు సంబంధించి ఆయన ఇచ్చిన హామీల్లో ఎనిమిది నెలలైనా ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడంతో ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఆయా పనులకు నేటికి కూడా ప్రభుత్వం నుంచి పాలనా అనుమతులు లభించనట్లు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ వర్గాలు చెబుతున్నాయి.

అనుమతులు రాని హామీలు ఇవే..

- పుచ్చకాయలమాడ - రామచంద్రాపురం వరకు రూ.4 కోట్లతో అప్రోచ్ రోడ్
- పుచ్చకాయలమాడ - పెరవలి వరకు రూ.5.60 కోట్లతో అప్రోచ్ రోడ్
- పుచ్చకాయలమాడ - హోసూరు వరకు రూ.2.40 కోట్లతో అప్రోచ్ రోడ్
- గ్రామంలో రూ.90 లక్షలతో దర్గా, హిందు స్మశానవాటికకు ప్రహరీగోడల నిర్మాణం
- రూ.30 లక్షలతో వెటర్నటీ లైవ్ స్టాక్ భవన నిర్మాణం

పెడింగ్‌లో రూ.70 కోట్ల బిల్లులు

పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా రాష్ట్రంలోనే కర్నూలు జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. నిర్ణీత సమయంలోగా అన్ని పనులను పూర్తి చేశారు. అయితే చేసిన ఈ పనులకు సంబంధించి ఐదు నెలలుగా బిల్లులు దాదాపు రూ.70 కోట్ల వరకు పెడింగ్‌లో ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల్లో అంతర్గత రోడ్ల పనులను చేసిన చిన్న కాంట్రాక్టర్లు చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక దిక్కులు చూస్తున్నారు.

సర్దుబాటుతో చతికిల'బడి'

- ఒకే పాఠశాలలో మాయమైన 10 ఉపాధ్యాయ పోస్టులు



పత్తికొండలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల

పత్తికొండ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం సరికొత్తగా తీసుకొచ్చిన సర్దుబాటు ప్రక్రియ పత్తికొండ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను దెబ్బతీసింది. పాఠశాలకు 40 ఉపాధ్యాయ పోస్టులు మంజూరవగా ఇక్కడ 31మంది పనిచేస్తున్నారు. ఇప్పుడు విద్యార్థుల నిష్పత్తికి అనుగుణంగా ఉపాధ్యాయులను కుదించారు. దీంతో 10 పోస్టుల వరకు ఇతర ప్రాంతాలకు కేటాయించారు. ఇప్పుడు 21మంది ఉపాధ్యాయులు మాత్రమే ఇక్కడ ఉండనున్నారు. ఇక్కడ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ఉంది. మొత్తం 1,300 మంది విద్యార్థులు ఇక్కడ ఉంటున్నారు. తరగతుల వారీగా సెక్షన్లు విభజించి బోధన కొనసాగిస్తూ వచ్చారు. ఈ ఏడాది కరువు పరిస్థితులు ఏర్పడటంతో తల్లిదండ్రులు వలస బాట పట్టి పిల్లలను కూడా తీసునకెళ్లారు. దీంతో విద్యార్థుల సంఖ్య 800కు తగ్గింది. దీంతో పాఠశాలలో 10 ఉపాధ్యా పోస్టులు మాయమయ్యాయి.

రైతుల ఆశలపై 'నీళ్లు'

- ఆయకట్టుకు అందని సాగునీరు



ఆలూరు తుంగభద్ర సబ్ బ్రాంచ్ కాలువ(ఫైల్)

ఆలూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు కష్టాలు ప్రారంభమయ్యాయి. వర్షాలు సరిగ్గా కురవలేదు. కాలువలకు సక్రమంగా సాగు నీరు కూడా రాలేదు. దీంతో అన్నదాతలకు కన్నీరే మిగిలింది. హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ నుంచి ఆలూరు సబ్ బ్రాంచ్ కాలువకు నీరు ఇవ్వాలనే ప్రతిపాదన ఉంది. అయితే కూటమి ప్రభుత్వం ఈ ప్రతిపాదనను పట్టించుకోకుండా రైతుల ఆశలపై 'నీళ్లు' చల్లింది.

ఇదీ ప్రతిపాదన..

ఆలూరు సబ్ బ్రాంచ్ కాలువకు హెచ్ఎల్సీ మెయిన్ కాలువ నుంచి నీరు వస్తుంది. మొత్తం 14,555 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. ప్రస్తుతం కాలువకు 650 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేస్తున్నారు. అయితే 150 నుంచి 200 క్యూసెక్కులు సాగు నీరు (హెచ్ఎల్సీ మెయిన్ కాలువ నుంచి) మించి విడుదల కావడం లేదని రైతులు వాపోయారు. చిప్పగిరి గ్రామానికి రెండు కిలోమీటర్ల సమీపంలో ప్రవహిస్తున్న హంద్రీ-నీవా సుజల స్రవంతి కాలువకు ప్రత్యేకంగా తూము (డీపీ)ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ తూము ఏర్పాటు చేస్తే దాదాపు 80 వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

పట్టించుకోని ప్రభుత్వం

కాలువకు నీరు రాక, పంటలు పండక రైతులు ఇబ్బందులు పడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. హంద్రీ-నీవా సుజల స్రవంతి కాలువకు ప్రత్యేకంగా తూము ఏర్పాటు చేయాలనే అధికారుల ప్రతిపాదనను పక్కన పెట్టారు. దీంతో ఆయకట్టు రైతులకు పంటలు పండటం లేదు.

హామీలను గాల్లోకి వదిలేశారు



ఎన్నికల సమయంలో టీడీపీ నేతలు ఇచ్చిన హామీలను గాల్లోకి వదిలేశారు. ప్రజల కష్టాలను పట్టించుకోవడం లేదు. సాగు ప్రాజెక్టులు నిర్మించాలని, కాలువలకు తూములు ఏర్పాటు చేయాలని ఆలోచన చేయడం లేదు. హెచ్ఎన్ఎస్ నుంచి ఏబీసీకి సాగు నీరు విడుదల చేయాలి. నగరడోణ గ్రామ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులు కూడా పూర్తిచేయాలి.

– బి. విరూపాక్షి, ఆలూరు ఎమ్మెల్యే

అనుమతులు రాలేదు

ఆలూరు సబ్ బ్రాంచ్ కాలువకు సాగుటిని విడుదల చేసేందుకు హెచ్ఎన్ఎస్‌కు ప్రత్యేకంగా తూము ఏర్పాటు చేయాలని గతంలో రూ. 3 కోట్లకు ప్రతిపాదనలు పంపారు. ఇప్పటి వరకు అనుమతులు రాలేదు. వాటర్ యూజర్స్ కమిటీ పర్యవేక్షణ చేయాల్సి ఉంది.

– చంద్రశేఖర్, హెచ్ఎల్సీ ఆలూరు ఏబీసీ డీఈ

మోసం చేసి పర్యటనా?

- ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు జి.గిడ్డమ్మ



మాట్లాడుతున్న గిడ్డమ్మ

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల సమయంలో మహిళలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక టీడీపీ అధినేత చంద్రబాబు మోసం చేశారని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గిడ్డమ్మ విమర్శించారు. మోసం చేసిన వ్యక్తి ఏ ముఖం పెట్టుకొని కర్నూలుకు వస్తున్నారని ప్రశ్నించారు. శుక్రవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్సు, 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500, తల్లికి వందనం కింద ఎంత మందిపిల్లలు ఉంటే అందరికీ రూ.15,000 ఇస్తామని టీడీపీ అధినేత హామీ ఇచ్చారనప్పారు. సంపద సృష్టించి మహిళలను లక్షాధికారులను చేస్తానని చెప్పి బిచ్చగాళ్లను చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి భారతి, పావని పాల్గొన్నారు.

నేడు కర్నూలుకు సీఎం చంద్రబాబు

కర్నూలు(సెంట్రల్): సీఎం చంద్రబాబు నాయుడు కర్నూలు పర్యటనకు అధికారులు సర్వంసిద్ధం చేశారు. శనివారం ఉదయం ప్రత్యేక విమానంలో కర్నూలు ఎయిర్‌పోర్టుకు, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో కర్నూలుకు చేరుకుంటారు. ప్రతి మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ఇందు కోసం రైతు బజార్‌లో అన్ని ఏర్పాట్లు చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన డంప్‌యార్డును సీఎం పరిశీలిస్తారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులు, రైతులతో ముచ్చటిస్తారు. ఇక్కడి నుంచి కేంద్రీయ విద్యాలయం ఎదురుగా ఉన్న ధనలక్ష్మీ నగర్‌లో స్వర్ణాంధ్ర పార్కు, దానికి అనుబంధంగా 100 అడుగుల రోడ్డుకు సీఎం శంకుస్థాపన చేస్తారు. అనంతరం సమీపంలోనే ఏర్పాటు చేసిన ప్రజా వేదికకు చేరుకుంటారు. భోజన విరామం అనంతరం పేదరిక నిర్మూలనకు ఎంపిక చేసిన 64,166 పీ4 బంగారు కుటుంబాలు, 20మంది మార్గదర్శకులతో ముచ్చటిస్తారు. ప్రజలతో మాట్లాడి సలహాలు, సూచనలు తీసుకుంటారు. సీఎం పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ విక్రాంత్‌పాటిల్ పలువురు ప్రజాప్రతినిధులు పరిశీలించారు. వీరి వెంట జేసీ డాక్టర్ బి.నవ్య, కర్నూలు ఆర్‌డీఓ సందీప్‌కుమార్ ఉన్నారు.

'మహా' బూటకం

- కూటమి ప్రభుత్వంపై మహిళల్లో పెరిగిన అసంతృప్తి

కర్నూలు(అగ్రికల్చర్): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు గడచింది. కూటమి ప్రభుత్వ పాలనలో మహిళ సంక్షేమం కుంటుపడింది. మహిళ అభ్యున్నతికి టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు చెప్పిన హామీల్లో ఒక్కటి కూడా అమలుకు నోచుకోలేదు.

అమలు కాని హామీలు ఇవీ..

- చంద్రన్నబీమా కింద సహజ మరణాలకు రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తు జరిగే మరణాలకు రూ.10 లక్షలు చెల్లిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించారు. ఇప్పటి వరకు అమలు చేయలేదు.
- ఆడబిడ్డల కోసం మహాశక్తి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని బూటకపు హామీ ఇచ్చారు. అమ్మకు వందనంలో భాగంగా 18 ఏళ్లు నిండిన మహిళలందరికీ నెలకు రూ.1,500 ప్రకారం బ్యాంకు ఖాతాలకే జమ చేస్తామని మాట ఇచ్చారు. ఓపిక ఉంటే ముగ్గురు, నలుగురును కనండి అందరికీ రూ.1,500 ప్రకారం చెల్లిస్తామని ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక ఈ మాట ఊసే లేకుండా పోయింది.
- స్వయం సహాయక సంఘాలకు రూ.10 లక్షల వరకు సున్నా వడ్డీ రుణాలు ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు అతీగతీ లేకుండా పోయింది.
- మహిళలకు ఉచిత బస్ ప్రయాణంఅంటూ ప్రకటించారు. ఆ ఊసే లేకుండా పోయింది.

పదివేల మంది వచ్చేరా?

కర్నూలుకు ముఖ్యమంత్రి వస్తుండటంతో 10 వేల మంది మహిళలను బహిరంగ సభకు తరలించడానికి డీఆర్‌డీఏ, మెప్మా అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇందుకోసం ఆర్‌టీసీ, ఇతర ప్రయివేటు బస్సులు 200 వరకు వినియోగిస్తున్నారు. కూటమి ప్రభుత్వంపై మహిళల్లో అసంతృప్తి వెల్లువెత్తుతోంది. ఈ నేపథ్యంలో మహిళలను తీసుకురావడం అంత సులభం కాదని తెలుస్తోంది. విషయం తెలిసి అధికారులపై టీడీపీ నేతలు ఒత్తిళ్లు తీసుకొస్తున్నారు. మహిళలను ఎలాగైనా నమ్మించి తీసుకరావాలని ఆదేశాలు ఇస్తున్నారు.

రైతులకు రూ.20 వేలు ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకు జూన్‌లో రూ.20 వేలు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. కరువు పీడిత ప్రాంతమైన కర్నూలు జిల్లాలో ప్రాజెక్టుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ కింద 106 చెరువులకు నీళ్లు ఇవ్వాలని కోరారు.

ధోబీ పోస్టులు భర్తీ చేయాలి

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల ముందు రజకులకు ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబునాయుడు అమలు చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సి.గురుశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రజక కార్పొరేషన్‌కు రూ.1,000 కోట్లు కేటాయించాలని, రజక రక్షణ చట్టాన్ని తేవాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ధోబీ పోస్టులను భర్తీ చేయాలని, ప్రతి నియోజకవర్గంలో రజకులకు కమ్యూనిటీ హాళ్లను నిర్మించాలని డిమాండ్ చేశారు.

అప్కాస్ కార్మికులను రెగ్యులర్ చేయాలి


కర్నూలు (టౌన్): అప్కాస్ (ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఔట్‌సోర్సింగ్ సర్వీస్)లో పనిచేసే మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని మున్సిపల్ కార్పొరేషన్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) అధ్యక్షుడు రమణ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డీఏలు, అరియర్స్, సరండర్ లీవ్ వేతనం, పీఆర్సీ అరియర్స్ ఇవ్వాలని తెలిపారు. 2023 జూలై 1 నుంచి వేతన సవరణ అమలు చేయాలన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను శనివారం కర్నూలు నగరానికి వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు పరిష్కరించాలని కోరారు.

కోడుమూరులో ప్ర'జల' కష్టాలు

- ఎండిపోయిన హంద్రీ నది
- అడుగంటిన భూగర్భ జలాలు
- పనిచేయని మంచినీటి బోర్లు
- ఐదు రోజులకోసారి నీటి సరఫరా



కోడుమూరు పట్టణంలో బిందె నీటి కోసం క్యూలో నిల్చున్న ప్రజలు



హంద్రీనదిలో మంచినీటి పథకాల వద్ద అడుగంటిన నీరు

కోడుమూరు రూరల్: నీళ్ల లేక హంద్రీ నది ఎండిపోవడంతో నియోజకవర్గ కేంద్రమైన కోడుమూరులో తీవ్ర మంచినీటి ఎద్దడి నెలకొంది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలో 45వేలకు పైగా ప్రజలు నివాసం ఉంటున్నారు. వీరికి మంచినీటిని అందించడం కోసం పంచాయతీ అధికారులు హంద్రీనదిలో ఎనిమిది బోర్లను వేశారు. వాటితో పట్టణంలోని ట్యాంకులకు నీటిని ఎక్కించి కాలనీల్లోని కుళాయిలకు వదులుతున్నారు. హంద్రీ నది ఎండిపోవడంతో బోర్లకు నీళ్లు అందని పరిస్థితి నెలకొంది. దీంతో పట్టణంలోని కొండపేట, వెంకటేశ్వరనగర్, లక్ష్మీనగర్, వెంకటగిరి రోడ్డు, మోబీన్‌వీధి, మెయిన్‌బజార్, కుర్నీనగర్‌లకు ఐదు రోజులకోసారి కుళాయిలకు నీటిని వదులుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే పట్టణంలో నీటి సమస్య మరింత జటిలంగా మారే ప్రమాదముంది. ఇకనైనా జిల్లా అధికారులు స్పందించి గాజులదిన్నె ప్రాజెక్టు నీటిని హంద్రీనదికి విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు.

స్పందించని టీడీపీ నేతలు

తాము అధికారంలోకి వస్తే గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి పైపులైన్ నిర్మాణం చేపట్టి కోడుమూరుకు శాశ్వత నీటి సమస్యను పరిష్కరిస్తామంటూ ఎన్నికల సమయంలో టీడీపీ నేతలు హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాది అయినా ఇప్పటి వరకు హామీని అమలు చేయలేదు. కనీసం నీటి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు సైతం చేపట్టడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

నీళ్లు కొంటున్నాం



కుళాయిలకు ఐదు రోజుల కోసారి నీళ్లను వదులుతున్నారు. అవి కూడా అందుతాయన్న నమ్మకం లేదు. ప్రతి రోజూ నీళ్ల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. చుట్టుపక్కల బోర్లలో ఎక్కడా మంచినీళ్లు లేవు. కుళాయిలకు సరిగా నీళ్లు రాక డబ్బులు పెట్టి క్యాన్ల నీళ్లు కొంటున్నాం.

– శ్రీనివాసులు, కొండపేట, కోడుమూరు

సమస్య ఉంది

హంద్రీ నది ఎండిపోవడంతో మంచినీటి పథకాలు సరిగ్గా పనిచేయడం లేదు. హంద్రీలో నీటి కొరత కారణంగా పట్టణంలో నీటి సమస్య ఉత్పన్నమవుతోంది. సమస్య పరిష్కారం కోసం కోడుమూరు హంద్రీనదికి గాజులదిన్నె ప్రాజెక్టు నీటిని విడుదల చేయాలంటూ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లాం.

– ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, కోడుమూరు

75శాతం సబ్సిడీపై పశుగ్రాసం విత్తనాలు

కర్నూలు(అగ్రికల్చర్): పశుగ్రాసం విత్తనాలు 75 శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు. జిల్లాకు పశుగ్రాసాల సాగుకు జొన్న విత్తనాలు 9 టన్నులు కేటాయించినట్లు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 5 కిలోల బ్యాగుల్లో లభిస్తాయని, పూర్తి ధర రూ.460 ఉండగా.. సబ్సిడీ రూ.345 ఉంటుందని, రైతులు రూ.115 చెల్లించాలని సూచించారు. ఏకవార్షిక రకానికి చెందిన జొన్న విత్తనాల కోసం రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు.

- అదేవిధంగా జిల్లాకు సమీకృత దాణా కూడా కేటాయించారన్నారు. 50 కిలోల బస్తా ధర రూ.1,110 ఉండగా.. 50 శాతం సబ్సిడీ రూ.555 పోను రైతులు రూ.555 చెల్లించాలన్నారు.

448 మంది గైర్హాజరు

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలకు శుక్రవారం 448 మంది గైర్హాజరైనట్లు ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి గురువయ్య శెట్టి తెలిపారు.

రైతు బజారు నిండా దళారులే!

- కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రైతు బజార్లలో దళారుల తిష్ట
- సిఫారస్సులతో కూటమి నేతల అనుచరులకు అవకాశం
- సీఎం వస్తుండటంతో స్టాళ్లలో ఒక్క రోజు మాత్రం రైతులు ఉండేలా అధికారుల యత్నం



రైతుబజారులో కూరగాయలు, ఆకుకూరలు విక్రయిస్తున్న దృశ్యం (ఫైల్)



రైతుబజారు

కర్నూలు(అగ్రికల్చర్): అటు రైతులకు, ఇటు వినియోగదారులకు సౌకర్యంగా ఉండేలా ఏర్పాటు చేసిన సీ – క్యాంప్ రైతు బజార్ దళారీలకు అడ్డాగా మారింది. పేరులో మాత్రమే రైతు ఉన్నప్పటికీ వాస్తవంగా రైతుబజార్లలో వారికి స్థానం లేకుండా పోయింది. ఒకవైపు టీడీపీ, మరోవైపు జనసేన, ఇంకోవైపు బీజేపీ నేతలు దళారీలను ప్రోత్సహిస్తున్నారు. రాష్ట్రంలోని టాప్ 5 రైతుబజార్లలో కర్నూలు సి.క్యాంపు రైతుబజారు ఒకటి. కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు ఇతర నాయకులు ఏడాది కాలంగా రైతుబజారులోకి తమ అనుకూలమైన వారికి అవకాశం కల్పిస్తున్నారు. 'వీరు మా వాళ్లు.. వారూ మావాళ్లు..'అంటూ సిఫారస్సు చేస్తూ రైతుబజారు నిండా దళారీలను నింపుతున్నారు. ఇటీవల సీ.క్యాంపు రైతుబజారులో దళారీలు ఎంతమంది ఉన్నారనే దానిని మార్కెటింగ్ శాఖ అధికారులు ఆరా తీశారు. రైతుబజారులో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పూలు తదితర వాటిని అమ్ముకునే వారు దాదాపు 400 మంది ఉన్నారు. ఇందులో 98 శాతం దళారీలు, 2 శాతం మంది రైతులు ఉన్నట్లు పరిశీలనలో తేలింది. దళారీలను కట్టడి చేసేందుకు ప్రయత్నించే సిబ్బందిపై తిరుగబడుతుండటం గమనార్హం. రైతుబజారులో అమ్ముకుందామని కూరగాయలు తెచ్చుకున్న రైతులకు దళారీలు చుక్కలు చూపిస్తారు. దళారీలను తట్టుకోలేక ఏదో ఒక ధరకు కూరగాయలు అప్పగించి పోతున్నారు. కర్నూలు, కల్లూరు, ఓర్వకల్లు, వెల్దుర్తి తదితర ప్రాంతాల నుంచి కూరగాయలు, ఆకు కూరలు తెచ్చిన రైతులను లోనికి రానివ్వకుండా బయటనే దళారీలు కొంటారు. రైతుల నుంచి తక్కువ ధరలకు కొని అక్కడే బోర్డుపై రాసిన ధరలను ఏ మాత్రం పట్టించుకోకుండా అధిక ధరలకు విక్రయిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అలాగే వినియోగదారుల పట్ల అమర్యాద పూర్వకంగా వ్యవహరిస్తున్నారనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ నెల 11వ తేదీ ఆదివారం వినియోగదారులతో రైతుబజారు కిటకిటలాడింది. బోర్డుపై రాసిన ధరలను పట్టించుకోవడం లేదంటూ... తూకాల్లో దగా చేస్తున్నారంటూ కనీసం 100 ఫిర్యాదులు వచ్చాయి. దళారీలు తిష్ట వేయడం వల్లనే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సీఎం వస్తున్నారని..

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కర్నూలు పర్యటన ఇటు రైతులు, అటు వినియోగదారులకు తీవ్ర కష్టాలకు గురి చేసింది. సీఎం వస్తున్నారు.. కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలనే కారణంతో గురు, శుక్రవారాల్లో రైతుబజారులోకి ఎవరినీ అనుమతించడం లేదు. గ్రామీణ ప్రాంతాల నుంచి రైతులు తీవ్ర వ్యయప్రయాసలతో తెచ్చుకున్న కూరగాయలు, ఆకుకూరలు, పండ్లను ఏమీ చేసుకోవాలో తెలియక ఆందోళనకు గురయ్యారు. క్వింటాళ్ల కొద్ది తెచ్చిన కూరగాయలను అమ్ముకునే అవకాశం లేకపోవడంతో బయట అతి తక్కువ ధరకు దళారీలకు అమ్ముకోవాల్సి వచ్చింది. శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు రైతుబజారులో జరిగే కార్యాక్రమంలో పాల్గొననుండటంతో రైతులకు మాత్రమే అనుమతి ఇస్తున్నారు. వినియోగదారులకు మాత్రం అనుమతి లేదు. సీఎం పర్యటన తమకు శాపంగా మారిందని రైతు లు ఆందోళనకు గురవుతున్నారు. రైతుబజారుకు అన్ని వైపుల అనేక మంది కూరగాయ లు, చిరు వ్యాపారాలు చేసుకుంటున్నారు. వీరందరినీ ఖాళీచేయంచడంతో వందలాది మందికి ఉపాధి లేకుండా పోయింది.

సారా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు



నీలి శికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎక్సైజ్ అధికారులు

నందికొట్కూరు: నాటు సారా తయారు చేసినా, విక్రయించినా చట్ట పరమైన చర్యలు తప్పవని అసిస్టెంట్ ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ రాముడు హెచ్చరించారు. శుక్రవారం పట్టణ పరిధిలోని నీలిశికారిపేటలో ఎక్సైజ్ పోలీసులు దాడులు చేసి 3,810 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 35 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టానికి వ్యతిరేకంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు తప్పవన్నారు. అనంతరం నీలిశికారులతో 'నాటు సారా తయారు చేయం.. విక్రయించం'.. అంటూ ప్రతిజ్ఞ చేయించారు. 2.0 కార్యక్రమంపై నీలిశికారులకు అవగాహన కల్పించారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుభాషిణి, మారుతి, టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ రమేష్, ఎక్సైజ్ సీఐలు రామాంజనేయులు, విజయకుమార్, ఎస్‌ఐలు జహ్రుల్లా, శ్రీనివాసులు, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సైకిల్‌పై శక్తిపీఠాల సందర్శన



సైకిల్ యాత్రలో రాధాకృష్ణ

ఆత్మకూరురూరల్: మండువేసవిలో సైకిల్‌పై ప్రయాణం ఎంత కష్టం. కాని ఆయన సంకల్ప శక్తికి మండే సూర్యుడు కూడా చల్లబడ్డాడేమోననిపిస్తోంది. షిరిడీకి చెందిన రాధాకృష్ణ అనే వ్యక్తి దేశం నలుమూలలా వెలసిన అష్టాదశ శక్తి పీఠాలను సైకిల్‌పై ప్రయాణిస్తూ సందర్శిస్తున్నారు. శ్రీశైలంలో వెలసిన శ్రీ భ్రమరాంబిక శక్తి పీఠాన్ని సందర్శించుకుని మరో శక్తిపీఠమైన అలంపూర్ జోగులాంబ దర్శనానికి వెళ్తూ శుక్రవారం మార్గమధ్యలో ఆత్మకూరులో కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను గత జనవరి నుంచి ఉత్తరభారతదేశంలోని శక్తిపీఠాలన్నింటిని సైకిల్ యాత్రలో దర్శించుకుని దక్షిణ దేశానికి చేరుకున్నానన్నారు. శ్రీలంకకు కూడా వెళ్లాల్సి ఉందని ఆయన తెలిపారు.

798 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 59 పరీక్ష కేంద్రాల్లో శుక్రవారం జరిగిన సెమిస్టర్ పరీక్షల్లో 798 మంది గైర్హాజరయ్యారు. 4వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 8,376 మందికి 7,632 మంది హాజరు కాగా 744 మంది గైర్హాజరయ్యారని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఎమ్మిగనూరు రావూస్ డిగ్రీ కళాశాల కేంద్రంలో ఒకరు, కర్నూలు సెయింట్ జోసెఫ్ మహిళా డిగ్రీ కళాశాల కేంద్రంలో ఒకరు మొత్తం ఇద్దరు విద్యార్థులు చూచిరాతకు పాల్పడగా గుర్తించి డిబార్ చేసినట్లు పేర్కొన్నారు. బీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలకు 589 మందికి 535 మంది హాజరు కాగా 54 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

వేసవి సెలవుల్లో చిన్నారులు జాగ్రత్త

- జిల్లా విపత్తుల నిర్వహణ అథారిటీ డీపీఎం అనుపమ



కర్నూలు(అగ్రికల్చర్): వేసవి సెలవుల్లో చిన్న పిల్లలు ఈత కొట్టడానికి వాగులు, వంకలు, చెరువులు, బావుల్లోకి వెలుతుంటారని, అటువంటి సమయంలో వారిపై కుటుంబీకులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా విపత్తుల నిర్వహణ అథారిటీ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అనుపమ సూచించారు. వేసవి ఎండల తీవ్రత మరికొన్ని రోజులు ఉండే అవకాశం ఉన్నందున చిన్న పిల్లలు, గర్భిణులు, వృద్ధులు వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శుక్రవారం డీపీఎం అనుపమ విలేకర్లతో మాట్లాడుతూ.. ఈ నెల చివరి వరకు ఎండలు, వడగాల్పుల తీవ్రత ఎక్కువగా ఉండే ప్రమాదం ఉందన్నారు. ఈ నెల చివరి వరకు మధ్యాహ్నం 12 నుంచి 4 గంటల మధ్య చిన్నపిల్లలు, సీనియర్ సిటిజన్‌లు, గర్భిణులు, బాలింతలు బయట తిరగరాదని, అత్యవసర పరిస్థితుల్లో బయటికి వచ్చినా గొడుగు ధరించాలన్నారు. ఉరుములు, మెరుపుల సమయంలో ఆరుబయట ఉండరాదని, చెట్లు, టవర్లకు సమీపంలో ఉండకూడదని తెలిపారు. అకాల వర్షాల సమయంలో సురక్షితమైన భవనాల్లో ఉండాలని పేర్కొన్నారు.

అధికారం ఇచ్చింది దోచుకునేందుకేనా ?

- ఎమ్మెల్యేగా చికెన్ దందా తగునా
- అక్రమార్జన కోసం ప్రజలపై భారం మోపుతారా?
- ఏజెంట్లను పెట్టి వ్యాపారులను బెదిరిస్తారా?
- ఆళ్లగడ్డ ఎమ్మెల్యేపై వైఎస్సార్‌సీపీ నాయకుడు భూమా కిషోర్‌రెడ్డి విమర్శలు



ఆళ్లగడ్డ: ప్రజలు అధికారం ఇచ్చింది ఇష్టమెచ్చినట్లు దోచుకునేందుకేనా? అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు భూమా కిషోర్‌రెడ్డి ఎమ్మెల్యే అఖిలప్రియను ప్రశ్నించారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలో చాగలమర్రిలో చికెన్ సెంటర్‌ల నిర్వాహకులను అందరిని తమ దగ్గరే చికెన్ కొనుగోలు చేయాలని అఖిలప్రియ, ఆమె భర్త భార్గవరామ్ మండలానికి ఒక ఏజెంట్‌ను పెట్టి బెదిరింపులకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. ఇంత వరకు ఇలాంటి దందా ఎవరూ చేయలేదన్నారు. కిలోకు రూ. 35 అదనంగా డిమాండ్ చేస్తున్నారని, ఇందులో ఎమ్మెల్యేకు రూ. 25, ఏజెంట్లకు రూ. 10 లెక్కన నిర్ణయించి వసూళ్లకు పాల్పడటం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఇది సామాన్యమైన స్కామ్ కాదు. ఒక్క ఆళ్లగడ్డ పట్టణంలోనే రోజుకు 5 వేల కిలోల చికెన్ విక్రయాలు జరుగుతుండగా.. నెలకు రూ. కోటి పైగా వసూళ్లు చేయడమే లక్ష్యంగా దందా కొనసాగిస్తున్నారు. ఇదంతా చికెన్ తినే సామాన్య ప్రజలపై భారం మోపడమే కదా అని మండిపడ్డారు. ఓట్లు వేసి గెలిపించిన సామాన్యులను దోచుకోనేందుకేనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చికెన్ డాన్‌గా ఎమ్మెల్యే అఖిలప్రియ పేరు గాంచారన్నారు. ఎవరైనా మాట్లాడినా.. మీడియాలో కథనాలు రాసిన ఆధారాలు ఉన్నాయా అంటూ బొంకుతూ పరువు నష్టం దావాలు వేస్తామంటూ బెదిరించడం తగదన్నారు. నేరుగా పోలీసులు మీడియా ముందు పేర్లు చెబుతున్నారని, వారి ఫొటోలతో చికెన్ డాన్ అఖిలప్రియ అని అన్ని మీడియాల్లో కోడై కూస్తుందన్నారు. ఇప్పుడు ఆ మీడియా కార్యాలయాల దగ్గరకు వెళ్లి కోళ్లు, కోళ్ల పెంట తీసుకెళ్లి నిరసన తెలపాలన్నారు. ఇలాంటి ప్రజా ప్రతినిధుల తోనే రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గ పరువు పోతోందని విమర్శించారు.

భక్తులూ జర భద్రం!



శిఖరేశ్వరం వద్ద భక్తులు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన ర్యాంప్ రైలింగ్ విరిగిపోయిన దృశ్యం



అవస్థలు పడుతూ దిగుతున్న భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శిఖరేశ్వరం వద్ద ఏర్పాటు చేసిన ర్యాంప్ రైలింగ్ విరిగిపోవడంతో భక్తులు అవస్థలు పడుతున్నారు. గత కొన్ని రోజుల నుంచి ఈ రైలింగ్ విరిగిపోయినా దేవస్థానం అధికారులు పట్టించుకోవడం లేదు. శ్రీశైల భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి వచ్చిన భక్తులు శిఖరేశ్వర దర్శనం తప్పనిసరిగా చేసుకుంటారు. శిఖరేశ్వరంపై ఉన్న నందికొమ్ముల నుంచి మల్లికార్జున స్వామి గర్భాలయ శిఖర కలశాలను దర్శనం చేసుకుంటే పునర్జన్మ ఉండదని భక్తుల విశ్వాసం. శిఖరేశ్వరం వద్ద మెట్లు ఎక్కలేని వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లుల కోసం ర్యాంప్ ఏర్పాటు చేశారు. అయితే రైలింగ్ విరిగిపోవడంతో భక్తులు అవస్థలు పడుతున్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



ఫుట్‌బాల్ క్రీడాకారులను అభినందిస్తున్న జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు ముప్పా రాజశేఖర్

కర్నూలు (టౌన్) : గుజరాత్‌లో ఈనెల 24వ తేదీన నిర్వహించనున్న జాతీయ స్థాయి ఖేలో ఇండియా ఫుట్‌బాల్ పోటీలకు కర్నూలు నగరానికి చెందిన ఎం. రేణుకా, బి. భువనేశ్వరీలు ఎంపికయ్యారు. ఎంపికయిన క్రీడాకారులను శుక్రవారం జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షులు ముప్పా రాజశేఖర్ తన కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయి ఖేలో ఇండియా ఫుట్‌బాల్ పోటీలకు కర్నూలు క్రీడాకారులు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. జాతీయ స్థాయిలో మంచి ప్రతిభ కనబరచాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ సంఘం ప్రతినిధులు శ్రీనివాసులు, వేణుగోపాల్, పాల్ విజయ్‌కుమార్, శ్రీధర్, కోచ్ బ్రహ్మకుమార్ పాల్గొన్నారు.

మల్లికార్జునపల్లిలో నిలిచిన ఉపాధి పనులు

- వేతనాలపై ప్రశ్నించినందుకు అధికారుల నిర్వాకం

ఆలూరు: హాలహర్వి మండలం మల్లికార్జున పల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులు నిలిచిపోయాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. పనిదినాలకు తక్కువగా వేతం వచ్చిదంటూ ఉపాధి పథకం టెక్నికల్ అసిస్టెంట్ రాజశేఖర్‌తో గ్రామానికి చెందిన కూలీలు వాగ్వాదానికి దిగారు. ఈ మేరకు ఈనెల 3న టెక్నికల్ అసిస్టెంట్ రాజశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజుతో కలిసి వెళ్లి మస్టర్లు తదితర అంశాలను విచారించి చేసిన పనులను కొలతలు వేశారు. అయితే తక్కువ కొలతలను చూపిస్తున్నారని కూలీలు ఈరప్ప, మల్లికార్జున, చాంద్‌బాషా ఈశ్వరప్ప తదితరులు టీసీ రాజశేఖర్‌ను నిలదీశారు. దీంతో ఆ రోజు నుంచి గ్రామంలో పనులు నిలిపేశారు. కాగా శుక్రవారం కూడా పనులు జరగలేదు. పనులు నిలిపివేయడంపై హాలహర్వి ఏపీఓ చక్రవర్తి దృష్టికి తీసుకెళ్లగా అలాంటిదేమీ లేదని సమాధానం దాటవేశారు.

అనుమానంతో భార్యపై దాడి

బండిఆత్మకూరు: అనుమానంతో భార్యపై భర్త దాడి చేసి గాయ పరిచిన ఘటన లింగాపురం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మద్దిలేటి అనే వ్యక్తి తన భార్య అన్నమ్మపై కొన్ని రోజులుగా అనుమానంతో గొడవపడుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకోగా ఆగ్రహంతో మద్దిలేటి భార్యపై రాయితో దాడి చేశాడు. ఈ దాడిలో ఆమె కన్నుకు గాయమైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గిరిజనులకు రాజకీయ ప్రాధాన్యత ఏదీ

- ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ కైలాస్‌నాయక్



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న గిరిజన నేతలు

కర్నూలు(అర్బన్): కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో గిరిజనుల రాజకీయ ప్రాధాన్యత కల్పించడంలో విస్మరించిందని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ కైలాస్‌నాయక్ విమర్శించారు. శుక్రవారం స్థానిక సీ క్యాంప్‌లోని డ్రైవర్స్ అసోసియేషన్ కార్యాలయంలో గిరిజన బంజారా ముఖ్య నేతల రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కై లాస్ నాయక్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడుస్తున్నా, గిరిజనులకు ఒక్క రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవి కూడా ఇవ్వలేదన్నారు. రాయలసీమ ప్రాంతంలో అధిక సంఖ్యలో ఉన్న బంజారా కులస్తులు రాజకీయ అభ్యర్థుల గెలుపోటములను శాసించే స్థాయిలో ఉన్నారన్నారు. అలాగే బీసీ, ఎస్సీ కార్పొరేషన్ల ద్వారా ఆయా సామాజిక వర్గాలకు చెందిన వారి ఆర్థికస్థితిగతులను మెరుగుపరచుకునేందుకు రుణాలు అందించే ప్రక్రియ ప్రారంభమైందని, గిరిజన కార్పొరేషన్ ద్వారా నేటికి ఎలాంటి ప్రక్రియ ప్రారంభించకపోవడం శోచనీయమన్నారు. రాయలసీమ విశ్వ విద్యాలయంలో ఓ గిరిజన అధికారిపై ప్రజా సంఘాల నాయకులు ఫిర్యాదు చేయడం సరికాదన్నారు. బంజారాలు మాట్లాడే భాషను 8వ షెడ్యూల్‌లో చేర్చాలని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలన్నారు. సమావేశంలో నాయకులు నాగరాజునాయక్, నేణావత్ రాము నాయక్, కాలు నాయక్, బాలునాయక్, రాజునాయక్, వెంకటేష్‌నాయక్, శ్రీనునాయక్, శంకర్‌నాయక్, బీ మద్దిలేటి, సీమ కృష్ణరాథోడ్, జయరామ్ నారాయణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వాహనం బాగుంటేనే సామర్థ్య పత్రం



వాహనాల ఫిట్‌నెస్ ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్



పర్యవేక్షణ మానిటర్

- అందుబాటులోకి వచ్చిన ఆటోమేటిక్ ఫిట్‌నెస్ పరీక్షలు
- మొదటి రోజు 4 వాహనాలకు మాత్రమే పత్రాలు జారీ

కర్నూలు: కర్నూలు నుంచి డోన్‌కు వెళ్లే జాతీయ రహదారి పక్కన చిన్నటేకూరు గ్రామ శివారులో ఎకరా విస్తీర్ణంలో వసుధ ఇండస్ట్రీస్ ప్రైవేట్ ఏజెన్సీ ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్(ఏటీఎస్) సేవలు శుక్రవారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. ఈ కేంద్రంలో కంప్యూటర్లను రాష్ట్ర రవాణా శాఖ కార్యాలయానికి అనుసంధానం చేశారు. వాహన సామర్థ్యం బాగుంటే సర్టిఫికెట్ (పత్రం) జారీ అవుతుంది. వాహనం స్కాన్ చేసిన తర్వాత ఏమాత్రం లోపాలున్నా వెనక్కి వెళ్లి మరమ్మతులు చేసుకుని రావాల్సిందే. మొదటి రోజు నాలుగు వాహనాలకు మాత్రమే టెస్టింగ్ పూర్తి చేసి పత్రాలు జారీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఏడేళ్ల లోపు వాహనాలు రెండేళ్లకోసారి, ఏడేళ్లు దాటిన వాహనాలు ఏడాదికోసారి వాహన సామర్థ్య పత్రం తీసుకోవాల్సి ఉంటుంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

బనగానపల్లె రూరల్: రాళ్లకొత్తూరు సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. బనగానపల్లె పట్టణం ఎస్సీ కాలనీకి చెందిన ప్రతాప్(37) తన భార్యను చూసేందుకు గోకులదిన్నె గ్రామానికి బైక్‌పై శుక్రవారం రాత్రి బయల్దేరాడు. మార్గమధ్యలో రాళ్ల కొత్తూరు గ్రామం సమీపంలో ఉన్న సుంకులమ్మ గుడి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ప్రతాప్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్ వెంటనే ప్రమాద స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న మృతుడి కుటుంబీకులు ఆసుపత్రికి చేరుకున్నారు. మృతుడికి భార్య పుల్లమ్మ, కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఐటీఐ.. అవకాశాలు మెండుగా..!

- పారిశ్రామిక శిక్షణా కేంద్రాల్లో ప్రవేశాలకు తొలి దశ నోటిఫికేషన్ విడుదల
- వివిధ ట్రేడుల్లో అడ్మిషన్లకు మే 24న తుది గడువు



డోన్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల

నంద్యాల(న్యూటౌన్): పదవ తరగతి పరీక్షలు పూర్తయి ఫలితాలు కూడా వచ్చాయి. ఇప్పుడు విద్యార్థులు పది అనంతర కోర్సులపై దృష్టి కేంద్రీకరించారు. ఇప్పటికే పాలిసెట్, రెసిడెన్షియల్ ప్రవేశ పరీక్షలు పూర్తయ్యాయి. పలువురు విద్యార్థులు వారి ఆసక్తిని బట్టి ఏ కోర్సులో చేరాలా అని ఆలోచన చేస్తున్నారు. అధిక శాతం మంది విద్యార్థులు ఇంటర్మీడియెట్‌లో చేరగా, పలువురు విద్యార్థులు పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సులకు ప్రాధాన్యమిస్తున్నారు. పదవ తరగతి పూర్తి చేయగానే త్వరితగతిన ఉపాధి పొందేందుకు ఐటీఐ కోర్సులు ఒక చక్కని బాటను ఏర్పాటు చేస్తాయని సాంకేతిక నిపుణులు చెబుతారు. ఐటీఐ కోర్సు పూర్తి చేసినవారు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఒక చక్కటి అవకాశంగా భావించవచ్చు. ఉద్యోగం, ఉపాధితో పాటు స్వయం ఉపాధికిసైతం ఐటీఐ కోర్సు దోహదపడుతుంది. జిల్లాలో ఐదు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఏడాది, రెండేళ్ల కాలపరిమితితో 1,084 సీట్లు ఉన్నాయి. 16 ప్రైవేట్ యాజమాన్యంలో 2225 సీట్లు ఉన్నాయి.ఐటీఐ కోర్సుల్లో ప్రవేశానికి మే 24వ తేదీ తుది గడువుగా ఉపాధి, శిక్షణ శాఖ ప్రకటించింది.

రెండేళ్ల కాలపరిమితి కోర్సులు..

ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఆర్‌అండ్ ఏసీ టెక్నాలజీ, మెకానికల్ మోటార్ వెహికల్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఇన్సిస్టిట్యూట్ మెకానిక్, టర్నర్, మెచినిస్ట్.

ఏడాది కాలపరిమితి కోర్సులు..

మెకానిక్ డీజిల్, సీవోపీఏ, వెల్డర్, సూయింగ్ టెక్నాలజీ, పీపీవో.

డ్రోన్ టెక్నాలజీపై స్వల్ప కాలిక కోర్సు ప్రారంభం..

ఈ ఏడాది నంద్యాల జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐలో నూతనంగా డ్రోన్ టెక్నాలజీ పై ఆరు నెలల వ్యవధి గల కోర్సును ప్రవేశ పెట్టారు. ప్రభుత్వ ఐటీఐలో 20 సీట్లు ఉన్న ఈ కోర్సును ఈ ఏడాది నుంచి ప్రారంభిస్తున్నారు. వ్యవసాయం, సర్వే, షూటింగ్స్‌లో డ్రోన్ టెక్నాలజీ వినియోగం పెరిగిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 10 ఐటీఐల్లో డ్రోన్ టెక్నాలజీ కోర్సును ప్రవేశ పెట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి



ఐటీఐలో చేరగోరే విద్యార్థులు మే 24వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు పరిశీలన సమయంలో సమీప ప్రభుత్వ ఐటీఐలకు విధిగా హాజరు కావాలి. కౌన్సెలింగ్ షెడ్యూల్ వివరాలను విద్యార్థుల మొబైల్‌కు పంపిస్తాం. పదవ తరగతిలో విద్యార్థి పొందిన మార్కులు, రిజర్వేషన్ రోస్టర్ ప్రకారం అడ్మిషన్స్ ఉంటాయి.

– ప్రసాదరెడ్డి, జిల్లా ప్రభుత్వ ప్రైవేటు ఐటీఐ కళాశాలల జిల్లా కన్వీనర్, నంద్యాల

సాక్షి ఫ్యామిలీ
కర్నూలు
శనివారం ॥ 17-5-2025

హైదరాబాద్ లో జరిగే 72వ మిస్ వరల్డ్ ఫెస్టివల్ లో చెక్ రిపబ్లిక్‌కు ప్రాతినిధ్యం వహిస్తుంది అడెలా స్ట్రాఫెకోవా. 21 ఏళ్ల ఈ బ్యూటీ మోడల్, ఫిట్నెస్ ట్రైనర్, ఈవెంట్ ఏజెన్సీ మేనేజింగ్ డైరెక్టర్‌గా కూడా పనిచేస్తోంది. కనెక్టింగ్ హార్ట్స్ అక్రాస్ జనరేషన్స్ పేరుతో రెండు, మూడు తరాల వారిని ఒకచోట చేర్చడం, ప్రేమ, దయ, స్నేహపూరిత వాతావరణాన్ని వ్యాప్తి చేయడంపై దృష్టి పెడుతుంది. 'ఏదైనా సాధించాలనుకోవడానికి ముందు తమకు నిజంగా ఏం కావాలో తెలుసుకోవడం ముఖ్యం' అంటూ తన గురించి తెలియజేసింది.



మనల్ని మనం తెలుసుకోవడమే..



అడెలా స్ట్రాఫెకోవా: చెక్ రిపబ్లిక్

"అందాల కిరీటం అనేది ఒక ఏడాది వరకే. కానీ, చాలామందితో కనెక్ట్ అవ్వచ్చు. నా కల ఒక్కటే! మిస్ వరల్డ్‌గా నన్ను నేను చూసుకోవాలి. నా చిన్నప్పటి నుంచే ఈ ఆలోచన ఉండేది. మా అమ్మ మేకప్ వస్తువులన్నీ నేనే వాడేసేదాన్ని. అమ్మ డ్రెస్సులు, హీల్స్ వేసుకొని ఇంట్లో తిరిగేదాన్ని. పదిహేనేళ్ల వయసు నుంచి అందాల పోటీలలో పాల్గొంటూ వచ్చాను. పదిహేడేళ్ల వయసులో మొదటి సారి ప్రపంచ పోటీలో పాల్గొన్నాను.

అందాల పోటీలలో పాల్గొనడమంటే అన్ని విధాల తమని తాము మానసికంగా, శారీరకంగా సంసిద్ధులను చేసుకోవడమే.

విజయసాధనకు..

బ్యూటీ కాంటెస్ట్‌లో చాలా ఛాలెంజెస్ ఉంటాయి. వివిధ రంగాలలో మమ్మల్ని పరీక్షిస్తారు. వాటిలో పాల్గొన్నప్పుడు కొంత ఆందోళనగా కూడా ఉంటుంది. కానీ, నన్ను నేను నిరూపించుకోవడానికి ముఖ్యమైన సమయం అదే. మిస్ బ్యూటీ కావాలని కలలు కనే యువతులు అనుకరించడం కాదు. ముందు తామేం కావాలని కోరుకుంటున్నారో తెలుసుకోవడం ముఖ్యం. నిజంగా ఏదైనా కోరుకుంటే 200 శాతం ప్రయత్నించాలి. అప్పుడే విజయం సాధించగలం. ఒక్క మిస్ విషయమే కాదు నేను ఏదైనా కోరుకున్నప్పుడు విజయం కోసం నా వంతుగా మొత్తం ప్రాణం పెట్టేస్తాను. అలాగే, విజయాలూ సాధించాను. కోరుకున్నది పొందాలంటే సరైన సమయం, శక్తి, దృష్టి పెడితే అదే మనకు అదృష్టంగా మారుతుంది. అందాల పోటీలలో పాల్గొనడమంటే అన్ని విధాల తమని తాము మానసికంగా, శారీరకంగా సంసిద్ధులను చేసుకోవడమే.

ఫిట్‌నెస్ ట్రైనర్

నాకు చిన్నప్పటి నుంచి క్రీడలంటే చాలా ఇష్టం. స్విమ్, రన్నింగ్, హార్స్ రైడింగ్ చేస్తాను. మోడలింగ్ నా కెరియర్. జీవనాధారం కూడా అదే. ఫిట్‌నెస్ ట్రైనర్‌గా కోచింగ్ ఇస్తాను. ఆ సమయంలో చాలా ఆనందిస్తాను. ఫిట్‌నెస్ గురించి నేను చెప్పే విషయాలు వినడమే కాదు, వాళ్లు ఆచరణలో పెడతారు. ఓ గొప్ప సమాజమే నాతో పాటు ఉందనిపిస్తుంది. వారితో నా అనుభవాలను పంచుకోవడం కూడా నాకు చాలా ఇష్టం. వారానికి కనీసం రెండుసార్లు ఫిట్‌నెస్ గ్రూప్‌లకు కోచ్‌గా పనిచేస్తాను.

నాకు ప్రస్తుతం ఉన్న క్షణం చాలా ముఖ్యమైనది. అందుకే ఈ క్షణంలో మాత్రమే జీవిస్తాను. సాధ్యమైనంత వరకు ప్రపంచాన్ని తెలుసుకోవాలి అనుకుంటాను.

ఫ్యాషన్ గురించి

ఒక వ్యక్తి తన వ్యక్తిత్వాన్ని తను ధరించే దుస్తుల ద్వారానే వ్యక్తపరచగలడు. మేం చెక్ రిపబ్లిక్‌లో స్థిరపడినా వివిధ దేశాలకు సంబంధించిన దుస్తుల్లో నన్ను నేను చూసుకుంటాను'' అని వివరించారీ బ్యూటీ.

– నిర్మలారెడ్డి

ఫొటోలు: ఎస్.ఎస్. ఠాకూర్

మిస్ వరల్డ్ 2025



● సంకల్ప బలం

వెయిట్ లిఫ్టర్ బామ్మ @70

వరల్డ్ స్ట్రెంత్ గేమ్స్‌కి రెడీ

అరవై ఎనిమిది సంవత్సరాల వయసులో జిమ్‌లోకి అడుగు పెట్టిన రోషిణి... ఇప్పుడు ఎన్నో వ్యాయామాలలో ఆరి తేరింది. వెయిట్ లిఫ్టింగ్‌లో పట్టు సాధించింది. అమెరికాలో జరగబోయే 'వరల్డ్ స్ట్రెంత్ గేమ్స్'లో పాల్గొనడానికి రెడీ అవుతోంది 70 సంవత్సరాల రోషిణి.

కుమారుడితో కలిసి దిల్లీలో ఉంటున్న రోషిణికి ఎడమ కాలి మోకాలినొప్పి మొదలైంది. మెట్లు ఎక్కడం, నడవడం కష్టంగా మారింది. ఆమె ఎడమ మోకాలికి ఆస్టియో ఆర్థరైటిస్ ఉన్నట్లు గుర్తించారు. కుడి చూపుడు వేలు బలహీన పడింది.

ఫిజియో థెరపీ మొదలు పెట్టింది.

'ఈ టైమ్‌లో అమ్మకు జిమ్ అవసరం ఉంది' అనుకున్నాడు ఆమె కుమారుడు, ఫిట్‌నెస్ కోచ్ అయిన అజయ్.

68 సంవత్సరాల వయసులో తొలిసారిగా జిమ్‌లోకి అడుగు పెట్టింది రోషిణి.

మెల్ల మెల్లగా ఆమెకు సాంత్వన చేకూరింది.

స్ట్రెచ్చింగ్, మూమెంట్ ఎక్సర్‌సైజ్‌లతో మొదలుపెట్టి వర్కవుట్స్‌ను ఎంజాయ్ చేయడం మొదలుపెట్టింది. రెగ్యులర్ ట్రైనింగ్ వల్ల చేయి బలపడింది. రోజువారీ పనులు కష్టంగా అనిపించేవి కాదు.

జిమ్ ఉత్సాహం ఆమెను వెయిట్ లిఫ్టింగ్ వైపు తీసుకువచ్చింది.

ఇప్పుడు రోషిణి ట్రాప్‌బార్ డెడ్‌లిఫ్ట్‌లో 97 కేజీల బరువు ఎత్తుతుంది.
80 కేజీల కన్వెన్షల్ డెడ్‌లిఫ్ట్స్ చేస్తుంది.
50 కేజీల స్క్వాట్స్ చేస్తుంది.
120 కేజీల లెగ్ ప్రెస్ చేస్తుంది.
4 నిమిషాల పాటు ప్లాంక్ పట్టుకోగలదు.

ప్రతిరోజూ రెండు గంటలు స్ట్రెంత్ ట్రైనింగ్, కార్డియో చేస్తుంది.

'దుప్పెన పట్టుకోవడం కూడా కష్టమే అని ఒకప్పుడు డాక్టర్లు అమ్మ గురించి చెప్పారు' అని గతాన్ని గుర్తు చేసుకున్నాడు అజయ్. జిమ్‌లో వర్కవుట్స్ పుణ్యమా అని ఇప్పుడు రోషిణికి ఇన్‌స్టాగ్రామ్‌లో వేలాదిమంది ఫాలోవర్స్ ఉన్నారు. వారు ఆమెను ప్రేమగా 'వెయిట్‌లిఫ్టర్ మమ్మీ' అని పిలుచుకుంటారు.

డైట్ విషయానికి వస్తే...

'ఎలాంటి రిస్ట్రిక్షన్స్‌లు లేవు. నాకు దహీ బల్లే అంటే చాలా ఇష్టం. అలా అని అదేపనిగా తినను. అప్పుడప్పుడు మాత్రమే తింటాను. ఏదైనా ఎక్కువ తీసుకోవడం మంచిది కాదు' అంటుంది ఇంటి భోజనాన్ని ఇష్టపడే రోషిణి.



● అజయ్, రోషిణి

వచ్చే సంవత్సరం అమెరికాలో జరిగే 'వరల్డ్ స్ట్రెంత్ గేమ్స్'కి ఆమెకు ఆహ్వానం అందింది.

ప్రస్తుతం రోషిణి ఆ ఈవెంట్ కోసం ప్రాక్టీస్ చేస్తోంది.

'ఒకప్పుడు నేను ఇంటికే పరిమితమయ్యేదాన్ని. ఇప్పుడు మాత్రం బయటికి వెళుతున్నాను. రకరకాల కార్యక్రమాలలో పాల్గొంటున్నాను. ఇప్పుడు సంతోషంగా ఉంది' అంటుంది రోషిణి.

'సీనియర్ సిటిజన్స్ జిమ్‌లో వ్యాయామాలు చేసినప్పుడు అది వాళ్లకు సంబంధించిన విషయం మాత్రమే కాదు. వారి నుంచి యువతరానికి సందేశం అందుతుంది' అంటున్నాడు అజయ్.

ఎండాకాలం వచ్చిందంటే గృహిణులకు చేతినిండా పనే.
ఎండను డబ్బాల్లో దాచి పెట్టాల్సిందే...
అప్పడాలు, వడియాల పని పట్టాల్సిందే!
పప్పులో.. పులుసులో.. సాంబారులో.. రసంలో...
ఇలా దేనిలో నంచుకున్నా ఆ రుచి అదుర్స్.
అన్నింటినీ మించి అప్పడం ఒక్కటి ఉంటే చాలు...
విందు భోజనం చేసిన ఫీలింగ్ వచ్చేస్తుంది.
అయితే ఎప్పటిలా రొటీన్ రుచులు కాకుండా
కాస్త వెరైటీ అప్పడాలివి... ప్రయత్నించి చూస్తారా?


అప్పడాలతో అదిరే విందు

వంటిల్లు

సగ్గుబియ్యం అప్పడాలు

కావలసినవి: సగ్గుబియ్యం – ఒక కప్పు (కడిగి, సగ్గుబియ్యం రకాన్ని బట్టి, 3 గంటలు లేదా రాత్రి అంతా నానబెట్టుకోవాలి); నీరు – సరిపడా; ఉప్పు – తగినంత; జీలకర్ర – అర టీస్పూన్; నువ్వులు – ఒక టీ స్పూన్ (అభిరుచిని బట్టి); పచ్చిమిర్చి పేస్ట్ – ఒక టీస్పూన్ (అభిరుచిని బట్టి); నిమ్మ రసం – అర టీస్పూన్.

తయారీ: ముందుగా మందపాటి గిన్నెలో 4 కప్పుల నీరు పోసి మరిగించాలి. నీరు మరుగుతున్నప్పుడు, నానబెట్టిన సగ్గుబియ్యంలోని నీరు వంపేసి, మరిగే నీటిలో వేసుకోవాలి. కాసేపటికి ఉప్పు, జీలకర్ర, నువ్వులు, పచ్చిమిర్చి పేస్ట్ వేసుకుని బాగా కలుపుకోవాలి. మంటను మీడియంకు తగ్గించి, సగ్గుబియ్యం పూర్తిగా ఉడికే వరకూ అడుగంటకుండా, మధ్య మధ్యలో కలుపుతూ ఉండాలి. సగ్గుబియ్యం ఉడికిన తర్వాత, అది జిగురుగా మారుతుంది. ఒకవేళ మరీ గట్టిగా అనిపిస్తే కొద్దిగా నీరు కలపవచ్చు. చివరగా నిమ్మరసం కలిపి ఒకసారి కలుపుకొని స్టవ్ ఆఫ్ చేయాలి. ఈ మిశ్రమం కొద్దిగా చల్లారనివ్వాలి. మరీ పూర్తిగా చల్లారకుండా, గోరువెచ్చగా ఉండగానే, ఒక ప్లాస్టిక్ షీట్‌ను ఎండలో లేదా ఇంట్లోనే నేల మీద పరచుకుని, ఒక చిన్న స్పూన్ సహాయంతో కొద్ది కొద్దిగా సగ్గుబియ్యం మిశ్రమాన్ని గుండ్రంగా లేదా మీకు నచ్చిన ఆకారంలో అప్పడాల్లాగా వేసుకోవాలి. ఒకదానికొకటి కాస్తంత దూరం ఉంచాలి. వీటిని 2 లేదా 3 రోజుల పాటు ఎండలో బాగా ఆరనివ్వాలి. అప్పడాలు గట్టిగా తయారవ్వాలి. ఒకవైపు ఆరిన తర్వాత రెండోవైపుకు తిప్పి ఆరబెట్టాలి. అప్పడాలు పూర్తిగా ఆరిన తర్వాత, వాటిని ఒక ఎయిర్ టైట్ కంటైనర్‌లో నిల్వ చేసుకోవచ్చు. ఇవి చాలా కాలం నిల్వ ఉంటాయి.



మిరియాల అప్పడాలు



కావలసినవి: బియ్యం పిండి – ఒక కప్పు; మిరియాల పొడి – 2 టీస్పూన్లు; ఉప్పు – తగినంత; జీలకర్ర పొడి– అర టీస్పూన్; వంట సోడా – చిటికెడు; నీళ్లు – కొద్దిగా; నూనె – డీప్ ఫ్రైకి సరిపడా.

తయారీ: ఒక గిన్నెలో కప్పు నీళ్లు పోసి మరుగుతుండగా మిరియాల పొడి, ఉప్పు, జీలకర్ర పొడి, వంటసోడా వేయాలి. కాసేపు మరిగాక అందులో బియ్యం పిండి వేసి అడుగంటకుండా బాగా కలపాలి. స్టవ్ మీదినుంచి దించేసి కాస్త చల్లారాక అందులో రెండు స్పూన్ల నూనె వేసి మరోసారి కలిపి, చిన్న చిన్న ఉండలుగా చేసుకోవాలి. ఒక ప్లాస్టిక్ షీట్‌పై కొద్దిగా నూనె రాసి, ఒక్కో ఉండను పలుచని గుండ్రని అప్పడాల ఆకారంలో ఒత్తుకోవాలి. వీటిని ఎండలో ఒకటి లేదా రెండు రోజుల పాటు బాగా ఎండనివ్వాలి. బాగా ఎండిన తర్వాత వాటిని ఒక గాలి చొరబడని డబ్బాలో నిల్వ చేసుకోవచ్చు.



టమాటో అప్పడాలు

కావలసినవి: టమాటోలు – అరకేజీ; బియ్యం పిండి – రెండు కప్పులు; సగ్గుబియ్యం – కప్పు (నానబెట్టినవి); పచ్చిమిర్చి – 2 లేదా 3 (కట్ చేసి పేస్ట్‌లా చేసుకోవాలి); ఉప్పు – తగినంత; జీలకర్ర పొడి– టీస్పూన్; నూనె – డీప్ ఫ్రైకి సరిపడా

తయారీ: టమాటోలను బాగా కడిగి, కట్ చేసి, మెత్తగా, గుజ్జులా చేసుకోవాలి. ఒక గిన్నెలో బియ్యంపిండి, నానబెట్టిన సగ్గుబియ్యం, టమాటో గుజ్జు, తరిగిన పచ్చిమిర్చి పేస్ట్, ఉప్పు, జీలకర్ర పొడి వేసి బాగా కలపాలి. అవసరమైతే కొద్దిగా నీరు చేర్చి మెత్తని పిండిలా చేసుకోవాలి. ఈ పిండిని చిన్నచిన్న ఉండలుగా చేసుకోవాలి. ఒక ప్లాస్టిక్ షీట్‌పై కొద్దిగా నూనె రాసి, ఒక్కో ఉండను పలుచని అప్పడాల ఆకారంలో ఒత్తుకోవాలి. ఈ అప్పడాలను ఎండలో 2 లేదా 3 రోజుల పాటు బాగా ఆరనివ్వాలి. పూర్తిగా ఆరిన తర్వాత వాటిని నిల్వ చేసుకోవచ్చు.

స్వేచ్ఛగా .. రెక్కలు విప్పేలా...

అమ్మాయిలకు చదువు కాదుకదా.. కనీసం వ్యక్తిగత శుభ్రత పాటించే వెసులుబాటు కూడా లేని చోట అందాల పోటీలంటే ఆనందంగా సాగనంపుతారా? పంపరు! అయోమ్ టీటో మతీజ్‌కు కూడా తీవ్ర నిరసన ఎదురైంది! అయినా వెనకడుగు వేయకుండా అందాల పోటీలకు అటెండ్ అయింది.. మిస్ సౌత్ సుడాన్‌గా కిరీటం ధరించి మిస్ వరల్డ్‌కి పోటీపడ్డానికి హైదరాబాద్ చేరుకుంది. తన దేశ పరిస్థితులు, వ్యక్తిగత వివరాలు, తన లక్ష్యం వగైరా ఆమె మాటల్లోనే...



అయోమ్ టీటో మతీజ్, మిస్ సౌత్ సుడాన్

"లా చదివాను. లీగల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాను. సౌత్ సుడాన్‌లో పుట్టాను. కానీ అక్కడి రాజకీయ అనిశ్చితి వల్ల మా అమ్మ మమ్మల్ని తీసుకుని కెనడాకు వలస వచ్చేసింది. అందుకే నేను అక్కడే పెరిగాను. మా నాన్న, ఆయన తరఫు, అమ్మ తరఫు బంధువులంతా సౌత్ సుడాన్‌లోనే ఉండిపోయారు. మా అమ్మ కెనడాలో టీచర్‌గా ట్రైన్ అయ్యి, మా సొంత దేశంలోని పిల్లలకు మంచి స్కూల్‌ను ఏర్పాటు చేయడానికి తిరిగి సుడాన్ వచ్చేసింది. దాదాపు 20 ఏళ్ల తర్వాత 2019లో నేను మా కుటుంబాన్ని చూడ్డానికి నా సొంత దేశానికి వెళ్లాను. ఎమోషనలే కాదు.. కొంచెం షాక్ కూడా అయ్యాను. కెనడాలో నేను ఆస్వాదించిన జీవితం, సౌత్ సుడాన్‌లో మా వాళ్లంతా అనుభవిస్తున్న జీవితాన్ని బేరీజు వేసుకుని. అప్పుడే డిసైడ్ చేసుకున్నాను నా దేశ ప్రజలకూ ఉన్నత ప్రమాణాల జీవితం అందేలా కృషి చేయాలని! కోవిడ్ తర్వాత వచ్చేశాను. సర్వీస్ మొదలుపెట్టాను. నా బ్యూటీ విత్ పర్పస్ అదే!

అందాల పోటీలకు వ్యతిరేకం

అందాల పోటీల పట్ల సౌత్ సుడాన్‌లో చాలా వ్యతిరేకత ఉంది. నేను మిస్ సౌత్ సుడాన్ పాజెంట్‌లో పాల్గొంటున్నప్పుడు, ఇప్పుడు కూడా నిరసన ఎదురైంది. కానీ నా దృష్టిలో ఈ పోటీలు స్కిన్ షో కాదు. వైవిధ్యమైన సంస్కృతులు, భాషలు, జీవనశైలులను పరిశీలించే, అధ్యయనం చేసే అవకాశాన్నిచ్చే వేదిక. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది. సర్దుబాటు, సహనాన్ని నేర్పిస్తుంది. ఇవన్నీ కూడా సామాజిక బాధ్యతను మెరుగ్గా నిర్వర్తించేందుకు తోడ్పడతాయి. అందుకే నిరసనను ఎదుర్కొని మరీ ఈ పోటీకి వచ్చాను. అంతేకాదు ఈ పోటీలు ఒకరినొకరు తెలుసుకుని, అర్థం చేసుకుని, ఒకరికొకరు సాయం అందించుకునే స్ఫూర్తినీ పంచుతాయి. మహిళలకు అలాంటి స్ఫూర్తి, ప్రేరణ అవసరం. దానికి అందాల పోటీలే కావాలా అంటారేమో! స్త్రీకి స్త్రీయే శత్రువు అనే నానుడి ప్రపంచ వ్యాప్తంగా పాతుకుపోయి.. అది స్త్రీల సహజ లక్షణమనే అభిప్రాయమూ అంతే లోతుగా నాటుకుపోయింది. దాన్ని అబద్ధమని నిరూపిస్తున్నాయి ఈ పోటీలు! కొన్ని దేశాల పేర్లే తెలియవు నేనీ కంటెస్ట్‌కి వచ్చేదాకా! అందుకే పట్టుబట్టి మరీ ఈ పోటీకి వచ్చాను. ఇక్కడి వైవిధ్యత, ఆధ్యాత్మికత నన్ను చాలా ఇన్‌స్పైర్ చేశాయి. ఈ దేశంలోని వాళ్లను చూస్తే నాకు ఫారినర్స్‌గా అనిపించరు. మా వాళ్లలాగే అనిపిస్తారు. ఎప్పుడో ఎక్కడో తప్పిపోయి.. ఇప్పుడు కలుసుకుంటున్నామేమో అనిపిస్తోంది! తెలంగాణ గురించి చెప్పుకోవాల్సి వస్తే ఇక్కడి ఎడ్యుకేషన్, మెడికల్ కేర్ గురించి కచ్చితంగా మాట్లాడుకోవాలి. ప్రపంచ ప్రమాణాలతో పోటీపడుతున్నాయి. సౌత్ సుడాన్ యువత తమ ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌కే వస్తోంది. మా దేశంలోని చాలామంది ప్రజలు ఆరోగ్య అవసరాల కోసం ఇక్కడి హాస్పిటల్స్‌నే ఆశ్రయిస్తున్నారు.

బాల్య వివాహాలు.. బలవంతపు పెళ్లిళ్లు

ప్రపంచంలోని అనేక దేశాల్లాగే సౌత్ సుడాన్‌లోనూ పురుషాధిపత్యమే! కొడుకుకే ప్రాధాన్యం. అమ్మాయికి వ్యక్తిగత శుభ్రత విషయంలోనూ ఆర్థికపరమైన వెసులుబాటు ఉండదు. బాల్యవివాహాలు, బలంతపు పెళ్లిళ్లు కామన్. ఇక చదువుకునే అవకాశమెక్కడిది? నేను ఇక్కడిదాకా రాగలిగాను అంటే మా అమ్మే కారణం. మమ్మల్ని ఆమె కెనడా గనుక తీసుకు వెళ్లకపోయుంటే నా పరిస్థితి ఎలా ఉండేదో (ఈ మాట చెబుతున్నప్పుడు ఆమె కళ్లల్లో నీళ్లు). నాకింకా గుర్తు.. ఆమె లగేజ్ సర్దుతుంటే 'మనం ఎక్కడికి వెళ్తున్నాం?' అని అడిగాను. 'మీరు స్వేచ్ఛగా మీకు నచ్చింది చదువుకునే చాన్స్ ఉన్న చోటికి' అని చెప్పింది! మేం నలుగురు అక్కచెల్లెళ్లం. మాకొక తమ్ముడు. అందరినీ సింగిల్ పేరెంట్‌గానే పెంచింది అమ్మ. ఎలాంటి అవకాశాల కోసం అమ్మ మమ్మల్ని కెనడాకు తీసుకెళ్లిందో అలాంటి అవకాశాలనే సౌత్ సుడాన్‌లోని అమ్మాయిలకూ కల్పిస్తోంది తాను నడిపిస్తున్న స్కూల్ ద్వారా! ఆమె చేస్తున్న ఆ సర్వీస్‌కి నేనూ శాయశక్తుల సాయపడుతున్నాను. మా దేశంలోని యంగ్ గర్ల్స్‌కి నేను మెంటర్‌గా ఉండాలి! వాళ్ల కలలను సాకారం చేసుకునేలా నేను తోడ్పడాలి. వాళ్లకు రెక్కలున్నాయనే విషయాన్ని గ్రహించేలా చేయాలి. సాధికారతకు, సామాజిక బాధ్యతకు ఐకాన్స్‌గా ఉండి, తర్వాత తరాలను ఇన్‌స్పైర్ చేసేలా వాళ్లను తీర్చిదిద్దాలి. ఇదంత సులువైన జర్నీ కాదు. అయినా ప్రయత్నం వీడను!'' అంటూ తన జర్నీ గురించి చెప్పారు మిస్ సౌత్ సూడాన్.

మా దేశంలోని యంగ్ గర్ల్స్‌కి నేను మెంటర్‌గా ఉండాలి! వాళ్లు కలలను సాకారం చేసుకునేలా నేను తోడ్పడాలి. వాళ్ళకు రెక్కలున్నాయనే విషయాన్ని గ్రహించేలా చేయాలి.

– సరస్వతి రమ

ఫొటో: ఎస్.ఎస్. ఠాకూర్

కూల్ రూఫ్ టెక్నాలజీ



కూల్ సమ్మర్

పెరుగుతున్న వేడిని తట్టుకోవడానికి సామాన్యులు తక్కువ ఖర్చుతో కూడిన పద్ధతుల వైపు దృష్టి సారిస్తున్నారు. ఇందులో కూల్ రూఫ్స్ ప్రోగ్రామ్ ఒకటి. ఈ ప్రోగ్రామ్‌లో భాగంగా టైటానియం ఆక్సైడ్‌లాంటి మెటీరియల్‌తో తయారుచేసిన ప్రత్యేకమైన వైట్ పెయింట్‌ను రూఫ్ టాప్‌లకు వేస్తారు.

దీనికి ముందు రూఫ్‌ను చెత్త, మురికి లేకుండా శుభ్రపరుస్తారు. 'వైట్ పెయింట్ వల్ల ఏ మేరకు ఫలితం ఉంటుంది?' అనే విషయానికి వస్తే... ఉష్ణోగ్రతలలో చెప్పుకోదగ్గ తగ్గుదల కనిపిస్తుందని ప్రాథమిక పరీక్ష ఫలితాలు తెలియజేస్తున్నాయి. 'సోలార్ రెఫ్లెక్టివ్ వైట్ పెయింట్ నార్మల్ పెయింట్ కాదు' అంటుంది అహ్మదాబాద్‌లోని 'మహిళా హౌజింగ్ ట్రస్ట్' మేనేజర్ దీపిక వద్గామ.

'రూఫ్‌కు రెండుసార్లు పెయింట్ వేయడం మంచిది. మొదటి లేయర్‌కు, రెండో లేయర్‌కు మధ్య కనీసం రెండు గంటల విరామం ఉండాలి' అంటుంది దీపిక. 'అధిక వేడి వల్ల ఇబ్బంది పడకుండా హోమ్–బేస్ వర్కర్స్‌కు కూల్ రూఫ్ టెక్నాలజీ ఉపయోగపడుతుంది. వారు చేసే పనికి అంతరాయం ఏర్పడకుండా ఉంటుంది' అంటుంది దీపిక. అహ్మదాబాద్‌లోని లాల్ దర్వాజ బస్‌స్టాప్‌ను 'కూల్ బస్ స్టాప్'గా క్లైమేట్–ఫ్రెండ్లీగా డిజైన్ చేశారు.

'ఒకప్పుడు వేసవికాలంలో ఇంట్లో ఉండడం కష్టంగా ఉండేది. వేడి తట్టుకోలేక కుట్టుమిషన్ పని ఆపేయాల్సి వచ్చేది. సోలార్ రిఫ్లెక్టివ్ వైట్ పెయింట్ వల్ల ఇంట్లో వేడి బాగా తగ్గింది. ఇప్పుడు ఎలాంటి ఇబ్బంది లేకుండా పనిచేసుకోగలుగుతున్నాను. వచ్చే సంవత్సరం కూడా రూఫ్‌కు వైట్ పెయింట్ వేయిస్తాను' అంటుంది సంగీత బెన్ అనే గృహిణి.